www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 24 డిసెంబర్ 2024
5
చిత్తూరు

ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- ఐరాల: ఐరాల ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను ఎంపీడీవో ధనలక్ష్మి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం అందిస్తున్న వైద్యసేవల గురించి ప్రజలను, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో కచ్చితంగా ప్రసవం చేయించుకోవాలని దీనివలన వారికి మంచి వైద్య సహాయం అందుతుందని తెలిపారు. అనంతరం బాలికల సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే బాలికలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బాలికల సంక్షేమ వసతి గృహం సందర్శించినారు. బాలికలతో ముచ్చటించారు. బాలికలు ప్రభుత్వం అందిస్తున్న వసతులు, ఇతర సహాయ సహకారాలు అందుతున్నాయా లేదా విచారణ చేసి హాస్టల్ వార్డెన్‌లకు తగిన సూచనలు జారీ చేసినారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి

డిఎం అండ్ హెచ్‌ఓకు సిఐటియు వినతి

నూతన డిఎంహెచ్‌ఓకు స్వాగతం పలుకుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఉన్న ఆశా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం చిత్తూరు జిల్లా నూతన డిఎంహెచ్‌ఓ సుధారాణికి సిఐటియు ఆధ్వర్యంలో అభినందిస్తూ సమస్యలపై వినతపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కే.సురేంద్రన్, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ మూడు నెలల క్రితం గత అధికారిని యూనియన్‌తో చర్చలు జరిపి అధికారులకు రాతపూర్వకంగా సర్కులర్ జారీ చేస్తూ ఆశాలపై వేధింపులు ఉండరాదని, అదనపు పనులు చేయరాదని, రాత్రులలో డ్యూటీలు వేయరాదని, ఎలాంటి పరీక్షలు చేయించరాదని, సమావేశాల సందర్భంగా కింద కూర్చోబెట్టరాదని, అధికారుల బ్యాగులను మోయించరాదని, బయట చెత్త ఊడ్చడం చేయించరాదని పంటి సమస్యలపై జారీ చేసిన వాటిని పిహెచ్‌సి అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా ఆశాలపై వేధింపులకు పాల్పడుతూనే ఉన్నారని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై డిఎం అండ్ హెచ్‌ఓ స్పందిస్తూ కచ్చితంగా ఆశా కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

పిజిఆర్‌ఎస్‌కు 178 అర్జీలు

ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని తెలిపారు. అలాగే ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. మొత్తం 178 అర్జీలు అందగా శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 145, జిల్లా అటవీ శాఖ 1, పంచాయతీరాజ్ 3, పోలీసు శాఖ 5, డిఎస్‌ఓ 2, మున్సిపల్ కమిషనర్ చిత్తూరు 3, డీఈవో 2, డిఆర్‌డిఏ 4, డిసేబుల్ వెల్ఫేర్ శాఖ 1, ఎంపిడిఓ జిడి నెల్లూరు 1, ఎంపిడిఓ ఐరాల 1, ఎంపిడిఓ పులిచర్ల 1, మెప్మా 1, అనిమల్ హస్బంద్రి 5, హౌసింగ్ 3. వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి కలెక్టర్‌కు యానాదుల ఫిర్యాదు

సోమవారం జిల్లా కలెక్టరేట్ కొత్త స్పందన హాల్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా చౌడేపల్లి, పూతలపట్టు, గంగాధర నెల్లూరు, గుడిపాల, చిత్తూరు మండలాలకు చెందిన యానాదులు, భూసమస్యలు, గోకులం షెడ్ల నిర్మాణాలు, రోడ్డు, దారి, తాగునీరు, గృహాల మంజూరు వంటి సమస్యలపై అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. చౌడేపల్లి మండలం దిగువపల్లి పంచాయతీ మోట్లపల్లి యానాది కాలనీకి చెందిన వెంకటలక్ష్మి రామకృష్ణలకు 20 సంవత్సరాల క్రితం 3ఎకరాల 40 సెంట్లు ప్రభుత్వ భూమిని భూపంపిణీలో భాగంగా ఇచ్చారు. భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా అందజేశారు. 20 ఏళ్లుగా భూమిలో బోరు వేసుకుని మామిడి చెట్ల పెంపకంతోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే మూడు రోజుల క్రితం అగ్రకులస్తులు వచ్చి ఆ భూమి తమదంటూ దౌర్జన్యం చేయడమేకాక పోలీసులతో వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తమ సమస్య పరిష్కరించి భూమిని తమకు దక్కులా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

గుడిపాల మండలం మండికృష్ణాపురం ఎస్టీ కాలనీకి చెందిన రాణి, మేఘ తమకు ఎటువంటి భూమి లేదని కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, తమకు వ్యవసాయభూమి మంజూరు చేసే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తామని అర్జీ అందజేశారు. అలాగే గంగాధర నెల్లూరు మండలం చేరిమిరెడ్డిపల్లి యానాది కాలనీకి చెందిన యానాదులు తమకు తాగునీరు వదలడం లేదని తాగునీరు లేక 12 కుటుంబాల వారు ఇబ్బంది పడుతున్నారని తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. చిత్తూరు రూరల్ మండలం జరిమడుగు యానాది కాలనీలోని రత్నం అనే వ్యక్తి తనకు ఇంటికి దారిలేక ఇబ్బంది పడుతున్నామని దారి సమస్య పరిష్కరించడంతోపాటు ఇంటి పట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని అర్జీ ఇచ్చిన యానాదులు

సకాలంలో పీజీఆర్‌ఎస్ వినతులు పరిష్కరించాలి

అర్జీలు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ద్వారా అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై సహాయ కమిషనర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. ఫిర్యాదులు, వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. గతవారం అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ 4, ప్రజారోగ్య విభాగం2 మొత్తం ఆరు వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాఫిర్యాదుల పరిష్కారం వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఎస్పిని, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ రాజశేఖర్ రాజు, చిత్తూరు డీఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమన్నారు. మొత్తం 28 ఫిర్యాదులు అందగా చీటింగ్ 2, కుటుంబ తగాదాలు 6, వేధింపులు 2, ఇంటి తగాదాలు 1, భూ తగాదాలు 8, డబ్బు తగాదాలు 3, ఆస్తి తగాదాలు 3, దారి సమస్యలు 3 ఉన్నాయి.

ఘనంగా పివికెఎన్ కళాశాల రజతోత్సవ మీట్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పివికెఎన్ ప్రభుత్వ కళాశాల 1997-2000 రజతోత్సవ అలుమ్ని మీట్‌ను సోమవారం కళాశాల ప్రాంగణంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జీవన్ జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమ కళాశాల పాత రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. పూర్వ అధ్యాపకులు డాక్టర్ దయానందరెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ భాను ప్రకాష్, అలుమ్ని కోఆర్డినేటర్ గోపీనాయక్, లెక్చరర్లు కోటేశ్వరరావు, రెడ్డిబాషా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ అలుమ్ని మీట్ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకుల మధ్య అనుబంధాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు. మీరందరూ సాధించిన విజయాలే పివికేయన్ కళాశాలకు గర్వకారణమని, మీ అనుభవాలను భాగస్వామ్యం చేయడం ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

అలుమ్ని సంబరాల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాల వద్ద

అధ్వానంగా పారిశుధ్యం

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: కట్టమంచి ప్రభుత్వ పాఠశాల వద్ద పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వారాల తరబడి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం చేరి దుర్గంధం వెదజల్లుతుంది. దీనికి తోడు కాలువలకు ఇరువైపులా దట్టమైన చెట్లు పెరగడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుతం మారిన వాతావరణంలో విద్యార్థులు దోమకాట్లకు గురై రోగాల భారిన పడుతున్నారని తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు పలు ఇబ్బంది పడుతుతున్నారని, మగ పిల్లలు ఆరు బయటకు వెళుత్తుండా ఆడపిల్లల పరిస్థితి దయనీయంగా ఉందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాల బయట పూడిపోయిన కాలువలు, ఏపుగా పెరిగిన చెట్లు

హెల్త్ రికార్డ్స్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంపై స్టేట్ నోడల్ ఆఫీసర్ సోమవారం జిల్లా డిఎంహెచ్‌ఓలకు, డిపిఎంఓలకు, మెడికల్ ఆఫీసర్లకు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం కింద ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రతి పేషెంట్ కి ఓపిలో ఈహెచ్‌ఆర్ (ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్) నమోదు చేసి వారి ఆరోగ్య స్థితిగతులు వివరాలను భద్రపరచడం జరుగుతుందని తద్వారా వారికి త్వరితగతిన చికిత్స చేయడానికి సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోగుల స్థితిగతులు వారి ఆరోగ్యం ఎలా ఉందనే ఫీడ్‌బాక్ తీసుకోవడం జరుగుతుందని, భవిష్యత్తులో తీసుకోవలసిన అన్ని జాగ్రత్తలను తీసుకొని ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందన్నారు. రోగులకు చేసిన ఆరోగ్య సేవలు, రక్త పరీక్షలు, స్కానింగ్ రిపోర్టులు, మందులు, శస్త్రచికిత్సలు అన్ని ఇందులో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో డిఎం హెచ్‌ఓ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అపోలో యూనివర్సిటీలో పరిశోధనను ప్రచురించుకోవటానికి సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అపోలో యూనివర్సిటీ ఇన్చార్జి రిజిస్టర్, ప్రొఫెసర్ సేతురామన్ ప్రారంభించారు. ప్రొఫెసర్ ఆదినారాయణ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. ఏదైనా విషయాన్ని ప్రచురించటం వల్ల మనం చేసిన పరిశోధనలు సమాజానికి ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపార్ట్మెంట్స్ నుంచి రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, అధ్యాపకులకు పాల్గొన్నారు. డాక్టర్ షానీ, డాక్టర్ మహేంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపులు ద్వారా తమకు ప్రముఖ పబ్లికేషన్స్‌లో తమ పరిశోధనలను ఎంత సులువుగా ప్రచురించుకోవచ్చు అనే విషయం తెలుసుకున్నామని తెలిపారు.

ఘనంగా 'నరువి' వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వేలూరులో ఉన్న నరువి హాస్పిటల్స్ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరువి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జీవీ.సంపత్ పాల్గొన్నారు. సోమవారం నరువి హాస్పిటల్స్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సహజ వనరులను పరిరక్షించడం, ప్రపంచ సామరస్యాన్ని పెంపొందిచడం, మతపరమైన సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం, మత్తుపదార్థాలను వ్యతిరేకించడాన్ని వ్యవస్థాపక దినోత్సవంలో ప్రధాన అంశాలుగా నిలిచాయి. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం జీవీ సంపత్ మాట్లాడుతూ వాతావరణ మార్పు కోసం అవకాశం ఉన్న ప్రతిచోట మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. తమిళనాడు ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలు చేపడుతుండగా, నరువి హాస్పిటల్స్ తన వంతు సహకారం అందజేస్తూ నీటి వనరులను సంరక్షిస్తోందని దీంతో పాటు మత్తుపదార్థాలను ఉపయోగాన్ని అణిచివేత దిశగా చర్యలు తీసుకుంటోందని, డ్రగ్స్‌కు బానిసలు కావడం వల్ల సమాజానికి హానికరంగా మారుతోందని పేర్కొన్నారు. హాస్పిటల్స్ వైస్ ఛైర్‌పర్సన్ అనితా సంపత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పాల్, జనరల్ మెడిసన్ హెడ్ డాక్టర్ కురియన్ థామస్, ఈఎన్టీ హెడ్ డాక్టర్ మేరీ కురియన్, న్యూరాలజీ హెడ్ డాక్టర్ చిత్రాంబలం, జనరల్ మెడిసన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ గుణశేఖరన్, డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నరువి హాస్పిటల్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో చైర్మన్ సంపత్

దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మండలంలోని చిన్న కొరివారిపల్లి గ్రామస్తులు సోమవారం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన 314/1,2, 300/7 సర్వే నెంబర్లలో ప్రభుత్వ గ్రామ కంఠభూమి ఉందని, దీన్ని గ్రామానికి చెందిన అగ్రవర్ణ కులాల వారు ఆక్రమించు కుంటున్నారని తెలిపారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు లేక దళితులు అవస్థలు పడుతున్నారని కనుక ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలు లేని వారికి మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సావిత్రి, కృష్ణయ్య, శివ, హరిబాబు, సుధాకర్, హంసవల్లి, గోవిందమ్మ పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరం విజయవంతంగా ముగిసింది. భారత ప్రభుత్వ ఆలింకో సంస్థ వారు నిర్వహించిన శిబిరానికి ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, కడా పీడీ వికాస్ మరమత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ శిబిరానికి కుప్పం, గుడుపల్లి మండలాలకు చెందిన దివ్యాంగులు, వయోవృద్ధులు 815 మంది పాల్గొన్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఏడి శ్రీనివాస్ తెలిపారు. ఇందులో 687 మందికి సహాయ ఉపకారణాలు అవసరమని గుర్తించినట్టు తెలిపారు. ఒకటిన్నర నెలలోపు సహాయ ఉపకరణాలు అందించనున్నట్టు కడా పీడీ తెలిపారు.

శిబిరంలో అధికారులతో ప్రసంగిస్తున్న కడా పీడీ

ఎస్వీఆర్ కాలేజ్‌లో బాస్కెట్ బాల్ కోర్టు ప్రారంభం

బాస్కెట్ బాల్ కోర్టును ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో దాతల సహకారంతో నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టును సోమవారం డీఎస్పీ దేగల ప్రభాకర్ ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టిపెట్టాలని తెలిపారు. బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణానికి శ్రీపురం సీతారామయ్య కుమార్తె పి.సురేఖ రూ.1,50,000లు, సాయిచైతన్య విద్యా సంస్థల అధినేత కిషోర్ కుమార్ రూ.90వేలు అందజేశారిని వారికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీతారామయ్య, దాతలు, అధ్యాపకులు, సిపిజెపి సభ్యులు పాల్గొన్నారు.

104 వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- యాదమరి: 104 వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా వారికి అవసరమైన చికిత్సలను వారి గ్రామాల వద్దనే అందించే నిమిత్తం 104 ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతినెలా 4వ సోమవారం దిగువగుట్ట కింద హరిజనవాడలో 104 సంచార వైద్యవాహనంతో పాటు వైద్యబృందం కూడా రావడం జరుగుతుందన్నారు. చిన్నచిన్న జబ్బులకు మీ గ్రామంలోనే వైద్యపరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా అందిస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సిహెచ్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 14 రకాల వైద్యపరీక్షలు అవసరమైన వారికి 107 రకాల మందులను ఇక్కడే అందిస్తామని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెల్త్ సూపర్వైజర్ సెల్వరాణి, ఎంఎల్హెచ్ పి.దిల్షాద్, ఆరోగ్య కార్యకర్త అమ్ములు, 104 డీఈఓ రవి పాల్గొన్నారు.

'ప్రజల మనిషి కుమార్ రాజా'

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా ప్రజల మనిషి అని మాజీ జిల్లా వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ పి.రామచంద్రారెడ్డి అన్నారు. కుమార్ రాజా జన్మదిన వేడుకలు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఆయనకు పలువురు దుశ్శాలువలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వైస్ఎంపిపి శిరీష్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ కామరాజు, మాజీ ఏఎంసి ఉపాధ్యక్షులు సర్దార్, మాజీ వడ్డెర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర ఎల్లప్ప, థామస్, గజేంద్ర, కిషోర్ కుమార్ రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల రికవరీ 'గోరంతే'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: డ్వాక్రా రుణాల దుర్వినియోగంలో చియ్యవరం పంచాయితీ మాజీ సంఘమిత్రలు మెక్కింది కొండంత అయితే.. కక్కింది గోరంతేనని స్త్రీ నిధి రికవరీ క్యాంప్ అధికారులు తేల్చేశారు. ఇటీవల తొట్టంబేడు మండలం చియ్యవరం పంచాయతీలో వెలుగు మహిళలు కట్టే స్త్రీ నిధి రుణాలను సక్రమంగా బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా మాజీ సంఘమిత్రలు 2 కోట్లా 16 లక్షల రూపాయలను పక్కదారి పట్టించారు. దీంతో ఆ ఇద్దరు సంఘమిత్రలను అధికారులు విధుల నుంచి తొలగించారు. గడువు నిర్దేశించి రికవరీకి ఆదేశించారు. అయితే ఆ సంఘమిత్రల నుంచి సరైన స్పందన లేకపోవడంతో సోమవారం స్త్రీ నిధి రికవరీ క్యాంప్ అధికారులు చియ్యవరం గ్రామానికి విచారణకు వెళ్లారు. 2 కోట్లా 16 లక్షలకు గాను సంఘమిత్రలు ఇప్పటివరకు రికవరీ కింద చెల్లించింది కేవలం 54 లక్షల రూపాయలు మాత్రమేనని గుర్తించారు. గతంలో దుర్వినియోగమైన స్త్రీ నిధి రుణాలతో పాటు మరో 13 లక్షల రూపాయలు పక్కదారి పట్టినట్లు అధికారులు పసిగట్టారు. ఇచ్చిన గడువులోగా దుర్వినియోగమైన సొమ్మును కట్టకపోవడం, మరో 13 లక్షల రూపాయల అవినీతి బయటపడడంతో గ్రామ సంఘమే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవచ్చని అధికారులు తెలియజేశారు. స్త్రీనిధి ఏజీఎం హేమంత్ కుమార్, మునిరత్నం, తొట్టంబేడు ఏపీఎం ఇందిరాగాంధీ, స్త్రీనిధి మేనేజర్లు వనజ, మురళీకష్ణ, మల్లేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సోదర సోదరీమణులకు

ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు: కలెక్టర్

చిత్తూరులోకేక్ కట్ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రం స్వర్ణాంధ్ర ప్రదేశ్ కావాలి.. ఇందుకు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక విజన్తో ముందుకు వెళుతూ కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే వి.ఎం.థామస్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నగర మేయర్ అముద, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్పర్సన్ కఠారి హేమలత, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి జిల్లా కేంద్రంలో ముందస్తుగా క్రిస్మస్ పండుగకు సంబంధించి హైటీ కార్యక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, జిల్లా మైనారిటీ అధికారి చిన్నారెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ మధుసూదన్ రెడ్డి డాక్టర్ ప్రభాకర్, ఎల్డిఎం హరీష్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో..

పేదలకు దుప్పట్లు పంపిణీ

గంగాధర నెల్లూరు: చిత్తూరు ఆనంద టెక్స్టైల్ ఎండి ఇలవరసన్ క్రిస్మస్ పండగ సందర్భంగా వేల్కూర్ షాలోమ్ సంస్థ అధ్యక్షులు జాన్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ మిట్టదళిత వాడ చర్చిలో సోమవారం 150 మంది పేదలకు బెడ్ షీట్లు పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా వేల్కూరు షాలోమ్ సంస్థ అధ్యక్షుడు జాన్ ప్రతి ఏడాది తమను కలిసి క్రిస్మస్ సందర్భంగా పేదలకు సహాయం చేయాలని సంప్రదించే వారని, తమవంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు వెంకటేష్, పార్లమెంట్ టిడిపి ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

కుప్పం టౌన్ : టేలర్ హై స్కూల్ పూర్వపు విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. డాక్టర్ సుదర్శన్, హఫీజ్, రూబీ, తౌసిఫ్, ప్రమోద్ కుమార్, అహ్మద్ బాషా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుప్పంలో..

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు టౌన్, రూరల్, మండలంలోని గంగవరం, బైరెడ్డిపల్లి మండలాల్లో 24వ తేదీ మంగళవారం 220 కెవిఏ విద్యుత్ సబ్స్టేషన్లో అదనపు బస్బర్ ఏర్పాటు చేయడం వలన మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ సి.చిన్నబ్బ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలాల్లోని ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

సమస్యల పరిష్కారానికి

విద్యుత్ పరిష్కార వేదిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి నగరంలో వినియోగదారుల సమస్యలు క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ శ్రీకారం చుట్టిందని ఆపరేషన్ టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విన్న కోటి చంద్ర శేఖర్ రావ్ తెలిపారు. 33/11 కె.వి రాజీవ నగర్, తొలప్ప గార్డెన్, ఎలమాండ్యం, ఇస్కాన్ , పార్క్ ఎస్.ఎస్. ఆర్. డి.ఓ ఆఫీసులో విద్యుత్ పరిష్కార వేదికను నిర్వహించారు. ఏడిలు రమేష్ , ఆంజనేయులు, ఏఈలు పుణ్యకోటి, హరి ప్రసాద్ , ఎల్.వి. నాగేంద్ర పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం విజయవంతం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రసూతి, స్త్రీ జననేంద్రియ విభాగం, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ,శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల, రాస్ సంస్థ, ఐఎమ్ఎ-మహిళా విభాగం, తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో సప్తగిరి నగర్ తిరుపతిలో ఆరోగ్య అవగాహన క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. మహిళలలో సంభవించే ఆరోగ్య సమస్యలు,వివిధ రకాల కేన్సర్లు గురించి అవగాహన, వాటిని తగ్గించడానికి నివారణ చర్యలు గురించి డాక్టర్ సునీత వివరించారు. ఈ శిబిరంలో 52 మంది మహిళలకు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో సునీత, డాక్టర్అరుణ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు డా.లలిత, డా.స్వాతి, డా.శరోన్, డా.అనూష, రాస్ సంస్థ సిబ్బంది, కరుణాకర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీకి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ఛైర్మన్ జయశంకర్ అన్నారు. సోమవారం మండలం శేషాపురం గ్రామ సమీపంలో గల రాక్ఫోర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా పోటీలలో రెండు కిలోమీటర్ల పరుగు పోటీకి విద్యార్థులు ఎంపికయ్యారు. తిరుపతి ఎస్వీయూ మైదానంలో ఈనెల 21న జరిగిన జిల్లా స్థాయిక్రాస్ కంట్రీ అథ్లెటిక్ పోటీలు నిర్వహించడం జరిగింది. అండర్ -16 బాలబాలికల విభాగంలో మహర్షి రాక్ఫోర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బాలికలు భానుప్రియ (రెండవ స్థానం) జ్వాల (మూడవ స్థానం) కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో హేమేష్ (మూడవ స్థానాన్ని) కైవసం చేసుకుని రాష్ట్రస్థాయిలో 2025వ సంవత్సరం జనవరి 5 తేదీ జరుగు పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రిన్సిపల్ గోవిందస్వామి, పాఠశాల ఇన్చార్జి మౌనిక, పీఈటీ అజయ్ కుమార్ పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

గ్రామ సమాఖ్యలదే తుది నిర్ణయం



విలేకర్లలో మాట్లాడుతున్న సంఘమిత్రలు, సిసి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: సంఘమిత్రల కొనసాగింపు విషయంలో గ్రామసమాఖ్యలదే తుది నిర్ణయం అని న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులపై పలువురు సంఘమిత్రలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కుప్పం మండలంలోని వి మిట్టపల్లి గ్రామానికి చెందిన గ్రామసమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సభ్యులు పాత సంఘమిత్ర అయిన పెరుమాళ్ను కొనసాగించాల్సిందిగా తీర్మానించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలోని మహిళా గ్రూపు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసమావేశానికి ముందు సిసి మదీనా మాట్లాడుతూ కొంతమంది సంఘమిత్రలు తమ విధి నిర్వహణలో సక్రమంగా లేరని, వారిని విడుదల నుండి తొలగిస్తూ గతంలో గ్రామ సమాఖ్యలు నిర్ణయించినట్టు తెలిపారు. అయితే సంఘమిత్రాలు తమను అధికారులు విధుల నుండి తొలగించారంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, ఈ విషయమై న్యాయస్థానం సంఘమిత్రాలను తొలగించే అధికారం ప్రభుత్వ అధికారులకు లేదని, గ్రామ సమాఖ్యల నిర్ణయమే తుది నిర్ణయమని ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఈ విషయమై స్పందించిన కడా పీడీ వికాస్ మరమత్ ఆదేశాల మేరకు ఏపిఓ సూచనలను అనుసరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను గ్రామ సమాఖ్యలకు వివరించడం జరిగిందన్నారు. వారి నిర్ణయం ప్రకారమే సంఘమిత్రాలు విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

ఫిబ్రవరిలో టిడిఆర్ బాండ్లు ఇస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మాస్టర్ ప్లాన్ల రోడ్ల కారణంగా భూమి కోల్పోయిన అర్హులకు ఫిబ్రవరి నాటికి టిడిఆర్ బాండ్లు మంజూరయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే తమ సొంత భూముల విలువ పెంచుకునేందుకు మాస్టర్ప్లాన్ల రోడ్ల పేరిట నిధులు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. తిమ్మినాయుడుపాలెం పరిధిలోని తిరుమలరెడ్డినగర్ సచివాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సు సోమవారం ఉదయం జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతోపాటు తహశీల్దార్ భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు. 50వ డివిజన్ కు సంబంధించిన రెవెన్యూ సమస్యలను తెలుగుదేశం, జనసేన నాయకులు సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, క్లస్టర్ ఇన్చార్జీలు బిజి కృష్ణయాదవ్, పులుగోరు మురళీ, శ్రీధర్ వర్మ, వెంకటరత్నం, మన్యం శ్రీనివాసులు, కార్పోరేటర్లు అనిల్, రాధా రెడ్డి, అన్నా అనిత పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో గృహ నిర్మాణశాఖ మంత్రి

ప్రజాశక్తి- తిరుమల : శ్రీవారిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి దంపతులు సోమవారం తెల్లవారుజామున దర్శించుకున్నారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకని తిరుగు ప్రయాణమయ్యారు.

5న స్థానికులకు

శ్రీవారి దర్శన టోకెన్లు జారీ

ప్రజాశక్తి- తిరుమల : శ్రీవారి దర్శనార్థం తిరుపతి స్థానికులకు 2025, జనవరి 5న స్థానిక దర్శన కోటా టోకెన్లను టిటిడి జారీ చేయనుంది. గత టిటిడి బోర్డులో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. 2025, జనవరి 7వ తేదీ మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు జనవరి 5న (ఆదివారం) తిరుపతి మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలోను, తిరుమల బాలాజీ నగర్ లో శ్రీవారి దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలలోని స్థానికులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందవలసి ఉంటుంది.

27న 'విక్రమ్'లో జాబ్ మేళా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని విక్రమ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 27న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడ్ ఆఫ్, డిఆర్డిఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్మేళా నిర్వహిస్తున్నట్లు విక్రమ్ కళాశాల ప్రిన్సిపల్ పట్టాభి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొత్త కోనేరు పక్కన గల విక్రమ్ డిగ్రీ కళాశాల నందు ఉదయం 9 గంటలకు జాబ్మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలైన ఇసుజు మోటార్స్ ఇండియా, ఫోర్టీ మేనేజ్మెంట్, అపాచ్ ఫుట్వేర్ ఇండియా తదితర కంపెనీలు ఈ జాబ్మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ లేదా ఐటిఐ, డిప్లమా, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత అయిన యువతీ యువలు ఈ జాబ్మేళాలో పాల్గొనవచ్చునని చెప్పారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుమల బైపాస్రోడ్డు కొర్లగుంట జంక్షన్లో 20-1-200/ఏ వద్ద డ్రైనేజీ సమస్య చాలా తీవ్రంగా ఉందని, శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ చరణ్తేజ్కు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. పెద్దకాపు వీధి లేఔట్లో నిత్యం పొంగుతున్న యుడిఎస్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్, పి.బుజ్జి, ఎం.నరేంద్ర, ఎ.రాధాక్రిష్ణ, ఆర్.మల్లికార్జునరావు, ఎం.రాజు, పి.రమేష్ పాల్గొన్నారు. మొత్తం 32 వినతులు తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 32 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు 32 మంది వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్ పాల్గొన్నారు.

1నుంచి భూములు భారం

- రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంపు
- జిల్లాపై రూ.15 కోట్ల భారం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఛార్జీలను 20-25శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జనవరి 1 నుంచి భూములకు సంబంధించి అన్ని రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఈ మేరకు తిరుపతి జిల్లాలో రిజిస్ట్రేషన్ చేసుకునేవారిపై 15 కోట్ల భారం పడనుంది. గత వైసిపి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఛార్జీలను భారీగానే రెండుసార్లు పెంచింది. తాజాగా చంద్రబాబునాయుడు సైతం పెంచడంతో రియల్టర్లు ఆందోళనకు గురవుతున్నారు. ఈ రిజిస్ట్రేషన్ ఛార్జీల భారంతో ల్యాండ్ ఓనర్ దగ్గర అగ్రిమెంట్ కుదుర్చుకుని ఆ భూమిని భూమిదారు నుంచి కొనుగోలుదారు తీసుకుంటే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉందని రియల్టర్లు ఆందోళన చెబుతున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లు లేని కారణంగా ప్రభుత్వానికి ఆదాయం తగ్గే అవకాశం ఉందన్నది వారి వాదన.

తిరుపతి జిల్లాలో బాలాజీ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి మరో 16 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. రోజువారీ ఎక్కువ రిజిస్ట్రేషన్ చేసే కార్యాలయాలు తిరుపతి

అర్బన్, రూరల్, రేణిగుంట,చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడుల్లో ఆదాయం ఎక్కువగా వస్తుంటుంది. రోజుకు 15-20 వరకూ రిజిస్ట్రేషన్లు ఈ ప్రాంతంలో జరుగుతూ ఉంటాయి. ప్లాట్లు, వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు, షాపుల రిజిస్ట్రేషన్లు అన్నీ కలిపి దాదాపు రోజుకు 350 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతూ ఉంటాయి. ఏకాదశి, పంచమి రోజుల్లో మాత్రం 500 పైగా రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉందని జిల్లా రిజిస్ట్రార్ చెబుతున్నారు. సరాసరి 350 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగితే రోజుకు 3 కోట్ల నుంచి 4 కోట్ల వరకూ ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. సరాసరి 2 కోట్ల వరకూ నికరంగా ఆదాయం అనుకుంటే పెంచిన ఛార్జీలు 50 లక్షలు, నెలకు 15 కోట్ల మేర రిజిస్ట్రేషన్ చేసుకునేవారిపైన భారం పడనుంది. జనవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునేవారిపై భారం పడనుంది.

పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్కు రెండు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రజాసంబంధాల వ్యాప్తి కోసం ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్కు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. ఛత్తీస్ఘడ్ రాజధాని రాయపూర్లో గల బాబిలోన్ ఇంటర్నేషనల్ హోటల్లో సోమవారం జరిగిన 46వ జాతీయ ప్రజాసంబంధాల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఛత్తీస్ఘడ్ ఉప ముఖ్యమంత్రి అరుణ్ సావో చేతులమీదుగా ఈ అవార్డును తిరుపతి చాప్టర్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, సెక్రటరీ డి.చంద్రమోహన్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డా. అజిత్ పాథక్, ఉపాధ్యక్షుడు యుఎస్.శర్మ, సెక్రటరీ జనరల్ పిఎల్కె.మూర్తి పాల్గొన్నారు. ఈ జాతీయ అవార్డు రావడం పట్ల టీటీడీ ప్రజాసంబంధాల అధికారి డా.టి.రవి, పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ వ్యవస్థాపక ఛైర్మన్ సి.రమాకాంతశర్మ, ఉపాధ్యక్షులు చంద్రమోహన్రావు, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, మాజీ ఛైర్మన్లు డా.స్వరాజ్యలక్ష్మి, డా.ఎన్.బి.సుధాకర్ రెడ్డి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఎన్.బి.హర్షవర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆర్సీకె.రాజు హర్షం వ్యక్తం చేశారు.

ఐరన్ బ్రిడ్జికి ఆటంకం

- రెండేళ్లుగా అసహనం
- ప్రజాపరిష్కార వేదికలో రచ్చ

ప్రజాశక్తి తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొన్ని అభివృద్ధి పనులు తీర్మానాలకే పరిమితం అవుతున్నాయి.. 80 మంది ఇంజినీర్లు ఉన్నా, 20 అడుగుల ఐరన్ బ్రిడ్జి నిర్మాణం జరగకపోవడమే నిలువెత్తు సాక్ష్యం. రాయల్చెరువు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించడం వల్ల కస్తూరిబాయి, కర్నాలవీధికి రాకపోకలు తెగిపోయాయి. స్థానికుల ఆందోళన ఫలితంగా కనెక్టివిటి కోసం 20 అడుగుల ఐరన్ బ్రిడ్జి నిర్మించాలని అనుకున్నారు. అయితే రెండేళ్లుగా ఈ పనులు సాగుతూనే ఉన్నాయి. తాజాగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్పొరేటర్ నరసింహాచారి ఈ విషయమై నిలదీయడంతో కొంతసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ రెండు వీధుల్లో అనేకమంది వ్యాపారులు ఉన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి పుణ్యమా అని తమ వ్యాపారాలు తగ్గాయని వారు వాపోతున్నారు.

కౌన్సిల్లో తీర్మానం చేసినా...

ఇంజినీర్ల కొరత లేదు. 80 మంది ఉన్నారు. అయితే 20 అడుగుల ఐరన్ బ్రిడ్జి నిర్మాణానికి ఎందుకు పూనుకోవడం లేదన్నది అర్థం కాని ప్రశ్న. రెండున్నరేళ్ల క్రితం కస్తూరిబాయ్, కర్నాలవీధి స్థానికుల ఆందోళనల ఫలితంగా ప్రజల రాకపోకల సంబంధాలు కొనసాగేలా 20 అడుగుల ఐరన్ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కౌన్సిల్లోనూ తీర్మానం చేశారు. అప్పటి వైసిపి ప్రభుత్వం రాయలచెరువు రోడ్డు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. కర్నాలవీధికి, కస్తూరిబాయి వీధికి వెళ్లాలంటే అండర్ బ్రిడ్జి అడ్డు రావడంతో స్థానికుల ఇబ్బందులను గుర్తించి 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి ఐరన్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కౌన్సిల్లో చర్చకు లేవనెత్తారు. కౌన్సిల్లో ఆమోదం తెలిపి పనులు చేస్తామని ప్రకటించింది. రూ.14 లక్షలు ఖర్చు అవుతుందని ఇంజినీర్లు అంచనాలను రూపొందించారు. అయితే ఇప్పటికీ ఈ పనులను మొదలు పెట్టలేదు. ఈ సమస్యపై కార్పొరేటర్ నరసింహాచారి మూడునెలల క్రితం ధర్నా చేసినా ఫలితం లేకపోయింది. 50 డివిజన్లలో ఒక్కో సచివాలయానికి ఒక్కరు చొప్పున 50 మంది ఇంజినీర్లు ఉన్నారని, కార్పొరేషన్లో మరో 30 మంది ఉన్నారని, మొత్తం 80 మంది ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నా బ్రిడ్జి నిర్మాణానికి తీరిక లేదా? అని ప్రశ్నిస్తున్నారు. అప్పటి తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్రెడ్డి దృష్టికి, ఇప్పటి కూటమి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

ప్రజా పరిష్కారాల వేదికలో...

సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వేదికలో అడిషనల్ కమిషనర్ను కార్పొరేటర్ నరసింహాచారి నిలదీశారు. దీంతో అడిషనల్ కమిషనర్ చరణ్తేజ్రెడ్డికి, కార్పొరేటర్ నరసింహాచారాకి వాగ్వివాదం చోటు చేసుకుంది. అధికారులను చేతగాని వాళ్లు అని ఎలా అంటారని చరణ్తేజ్రెడ్డి మండిపడ్డారు. కార్పొరేటర్ నరసింహాచారి సమాధానం ఇస్తూ అధికారుల చేతగానితనం అని తాను అనలేదని సర్దుకున్నారు. ఏది ఏమైనా 20 అడుగుల ఐరన్ బ్రిడ్జి ప్రతిపాదన మరోసారి తెరకెక్కింది.